

మధురవాడ కళాశాల హాస్టల్‌లో బయటకు పొంగుతున్న టాయిలెట్ మ్యాన్‌హోల్



మధురవాడ సమీకృత హాస్టల్లో అధ్వానంగా తాగునీటి కుళాయి పరిసరాలు



మధురవాడ సమీకృత హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

మరీ ఇంత అధ్వానమా..?

- ఘోరంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలు
- దుర్గంధభరితంగా టాయిలెట్లు
- తలుపుల్లేని కిటికీలు, మరుగుదొడ్లు
- ఈగలు, దోమలతో విద్యార్థుల సహవాసం
- పట్టించుకోని అధికారులు



మధురవాడ కళాశాల హాస్టల్లో పగిలిపోయిన కిటికీల అద్దాలు



నిర్వహణ అధ్వానంగా ఉన్న సమీకృత హాస్టల్

మధురవాడ: పాలకుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో మధురవాడలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు అధ్వానంగా మారాయి. అపరిశుభ్ర వాతావరణంలో, అసౌకర్యాల నడుమ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి.

మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలో సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహాలు ఉన్నాయి. ఈ రెండు హాస్టళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండింటికీ ప్రహరీ లేదు. వీటి మధ్యలో నుంచి భారీ మురుగు నీటి కాల్వ ప్రవహిస్తుండడంతో ఇబ్బందికరంగా ఉంది. హాస్టళ్లకు ప్రహరీలు లేకపోవడంతో పందులు, కుక్కలు లోపలికి వచ్చేస్తున్నాయి. ఈ హాస్టల్స్ ఎదురుగా కొందరు వ్యక్తులు పందుల కోసం నిల్వ ఉన్న ఆహార పదార్థాలతో తెచ్చిన వాహనాలు ఉంచి, వేరే డ్రమ్ముల్లోకి, బకెట్లలోకి తోడుతుండడంతో విపరీతంగా దుర్వాసన వస్తోందని విద్యార్థులు తెలిపారు.

మరుగుదొడ్లు మరీ ఘోరం

సమీకృత వసతి గృహం నిర్వహణ మరీ ఘోరంగా ఉంది. ఇద్దరు వార్డెన్లున్నా నిర్వహణ దారుణంగా ఉంది. ఇక్కడ మరుగు దొడ్లకు తలుపులు, ట్యాప్‌లు ఏ మాత్రం సక్రమంగా లేవు. బేసిన్ ఇతర పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కింద ఫ్లోర్‌లో టాయిలెట్లు అధ్వానంగా ఉండగా.. పై ఫ్లోర్‌లో ఉన్న మరుగుదొడ్లకు తాళం వేసి ఉంచారు. మేడపై నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. మరుగుదొడ్ల పక్కనే ఉన్న విద్యార్థుల గదుల్లోకి ఈ నీరు వెళ్లకుండా విద్యార్థులే గోనెలు, గుడ్డలు పెట్టుకోవాల్సిన దుస్థితి.

- ఇటీవల అర్ధరాత్రి సమయంలో ఐదుగురు పిల్లలు అనుమతి లేకుండా బయటికి వెళ్లిపోయారు. ఆటో డ్రైవర్ వీరిని గమనించి, పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో అక్కడి నుంచి హాస్టల్‌కు క్షేమంగా చేరుకోగలిగారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

ఇక్కడ ఆర్వో ప్లాంట్ మూలకు చేరి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. తప్పనిసరి పరిస్థితుల్లో వీరు ఆ అపరిశుభ్ర వాతావరణంలోనే కుళాయి నీరే పట్టుకుని తాగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో హాస్టల్ అభివృద్ధికి నిధులు మంజూరైనా ప్రస్తుత పాలకులు పనుల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదు.

ఒక్క కిటికీకి అద్దాలు లేవు

కళాశాల బాలుర వసతి గృహంలోనూ మరుగుదొడ్లు నెలకు ఒక్కసారే శుభ్రం చేస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్ ఓపెన్ అయ్యి ఉండడంతో దుర్వాసన వస్తోంది. ఈ భవనంలో గదులకు ఉన్న కిటికీల అద్దాలు దాదాపుగా మూడొంతులు పగిలిపోవడంతో విద్యార్థులు కర్టెన్‌లు, వస్త్రాలు పెట్టుకుంటున్న పరిస్థితి.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> హాస్టల్స్‌లో మరుగుదొడ్లు, కిటికీల మరమ్మతులు, ఇతర పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం.
>
> –రమాదేవి, ఏఎస్‌డబ్ల్యూవో

జోనల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ



జోన్–2 కమిషనర్ సింహాచలంను అభినందిస్తున్న సిబ్బంది



జోన్–1 జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణి

- జోన్–1 జెడ్సీగా ప్రసన్నవాణి
- జోన్–2 జెడ్సీగా సింహాచలం

భీమునిపట్నం: భీమిలి (జోన్–1) జోనల్ కమిషనర్‌గా నియమితులైన పి.ప్రేమ ప్రసన్నవాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సాలూరు మున్సిపాలిటీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన జెడ్సీ కనకమహాలక్ష్మిని అధికారులు సీడీఎంఏకు రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన జెడ్సీ ప్రసన్నవాణి మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించే పనులు సక్రమంగా జరిగే విధంగా చూస్తానన్నారు. ఎవరైనా సమస్యల గురించి తన దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కమిషనర్‌గా గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జి.శైలజా వల్లి రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా బదిలీ కావడంతో ఆమె స్థానంలో సింహాచలం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు అభినందించారు. జెడ్సీ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈయనను సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈఈ శాంతి రాజు, ఏఈ సురేష్ తదితరులు అభినందించారు.

దుర్గాలమ్మకు పూజలు: బాధ్యతలు స్వీకరించే ముందు జెడ్సీ సింహాచలం జాతర గట్టుపై కొలువైన చంద్రంపాలెం దుర్గాలమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అంతా మా ఇష్టం



నిర్మాణ సామగ్రితో ఫుట్ పాత్ ఇలా..

కొమ్మాది: రుషికొండ బీచ్ రోడ్డులో నిత్యం వేలాది వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉండటంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కొందరు వ్యాపారులు ఇష్టానుసారం కమర్షియల్ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఫుట్‌పాత్‌పైనే నిర్మాణ సామాగ్రి, బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వేకువజామున వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసినవన్నీ ఫుడ్ కోర్టులే. దీంతో మధ్యాహ్నం, సాయంత్రం రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక కమర్షియల్ నిర్మాణానికి అనుమతి ఇచ్చినప్పుడు తప్పనిసరిగా పార్కింగ్ స్థలం ఉండాలి. ఇవేవీ లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గానీ, ట్రాఫిక్ పోలీసులు గానీ పట్టించుకోకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేజీహెచ్‌కు 50 వీల్ చైర్ల వితరణ



కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వీల్ చైర్లు అందజేస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

మహారాణిపేట : కేజీహెచ్‌కు 50 వీల్ చైర్లను దివీస్ ల్యాబ్ అందించింది. రోగులు పడుతున్న అవస్థలను దివీస్ ఎండీ మురళి ప్రత్యక్షంగా చూశారు. దీంతో 50 వీల్ చైర్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైజాగ్ శాఖ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆర్‌ఎంవోలు డాక్టర్ మోహన్‌కుమార్, డాక్టర్ ధవళ భాస్కరరావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్ కుమార్, డి.శేఖర్ బాబు, పైడినాయుడు, సీనియర్ అసిస్టెంట్ సాంబమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ముత్తంశెట్టి కుటుంబ సభ్యులు



తిరుమలలో కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో సహా గురువారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ముత్తంశెట్టి సతీమణి జ్ఞానేశ్వరి, వారి కుమార్తె, జీవీఎంసీ విప్ ముత్తంశెట్టి ప్రియాంక, అల్లుడు శ్రవణ్ కుమార్ రెడ్డి, వారి కుమారుడు, అవంతి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి నందీష్ తదితరులున్నారు.

ప్రధాని చిత్రపటం బహూకరణ

పద్మనాభం: సేవాపక్షోత్సవాల్లో భాగంగా ప్రతి తహసీల్దార్ కార్యాలయానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్ర పటాలను అందిస్తున్నామని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పద్మనాభం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు మోదీ చిత్రపటానికి బహూకరించారు. మాజీ జడ్పీటీసీ దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు అల్లూరి పేరు హర్షణీయం

తగరపువలస: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్‌పోర్టుకు పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ చెరు కూరి వెంకటపతిరాజు స్వాగతించారు. ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్రంలో క్షత్రియుల ఆకాంక్ష నెరవేరేలా అల్లూరికి తగిన గౌరవం దక్కిందన్నారు.

క్లుప్తంగా

ఉచిత కుట్టుశిక్షణ తరగతులు ప్రారంభం



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో ఫౌండేషన్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద మహిళలు, యువతులు స్వయం ఉపాధి పొందేందుకు ఈ శిక్షణను ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇది పదో శిక్షణ కార్యక్రమమని, ఇందులో 45మంది పాల్గొంటున్నారని తెలియజేశారు. ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే 96432 22666 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నేడు

భీమునిపట్నం: భీమిలిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టనున్న ఈ ఉద్యోగ మేళాకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు శుక్రవారం ఉదయం పది గంటలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుని, జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

బాక్సింగ్‌లో కుష్మితకు బంగారు పతకం



కుష్మితను అభినందిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో భీమిలి మండలం చిప్పాడ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి కనకరాజు కుమార్తె వెంపాడ కుష్మిత బంగారు పతకం సాధించింది. ఈమె భీమిలి సమీపంలోని కీతీస్‌పేట వద్దనున్న ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. కోచ్ వాసుపల్లి ఆదినారాయణ వద్ద శిక్షణ పొందుతోంది. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది కుష్మితను అభినందించారు.

'గీతం' పీహెచ్‌డీ స్కాలర్లకు ఫైజర్ ఫెలోషిప్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ద్వారా పీహెచ్‌డీ స్కాలర్లుగా నమోదు చేసుకుని, ఔషధ అధ్యయనాలు జరిపే పరిశోధకులకు ప్రముఖ ఔషధ సంస్థ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫెలోషిప్‌ను అందించనుంది. ఈ మేరకు గీతం, ఫైజర్ సంస్థలు గురువారం అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఔషధ అధ్యయనాలు ప్రోత్సహించడానికి ఈ విద్యా గ్రాంట్ ఎంతో ఉపకరిస్తుందని ఫైజర్ సంస్థ ఉపాధ్యక్షుడు మురళీధర్ శర్మ పేర్కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



రాట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలకు చిట్టివలస గణేష్ థియేటర్ ప్రాంతవాసులు సన్నద్ధం అవుతున్నారు. అందులో భాగంగా గురువారం అర్చకుడు ఏడిద వివేకానందశర్మ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి, ఉత్సవరాట వేశారు. అక్టోబర్ నుంచి భవానీమాలలు ధరించి ఉత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. రాజాన ప్రసాద్, నక్కాన రాజు, నవిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభంలో తోపులాట



భోజనం కోసం తోసుకుంటున్న జనం

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు ఆర్‌జీకే కాలనీ వద్ద అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. అయితే,భోజనం కోసం పిలిచి నాయకులు లోపలికి వెళ్లి ప్రజలను బయట ఉంచి తలుపులు మూసేశారని, సాయంత్రం 6 గంటల నుంచి ఉంచి, ఇలా చేశారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఉండగానే లోపల ఉన్న వారు భోజనం కోసం తోసుకున్నారు. అరుపులతో క్యాంటీన్ హోరెత్తింది. ముందుగా మధురవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన ఔషధి జనరిక్ మందుల షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. మధురవాడ పీఏసీఎస్‌ను క్రెడిట్ సొసైటీగా మార్చాలని సొసైటీ పూర్వ ఉపాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్లు మంగమ్మ, హేమలత, సహకార శాఖ డివిజన్ అధికారి దుర్గా ప్రసాద్, పర్సన్ ఇన్‌చార్జ్ రమేష్‌బాబు, జెడ్సీ సింహాచలం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి కస్తూర్బా విద్యార్థిని



తనూజ

పద్మనాభం: మండల పరిధి కృష్ణాపురంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఎ.తనూజ అండర్–17 ఫుట్‌బాల్ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆంధ్రా యూనివర్సిటీలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ అండర్–17 ఫుట్‌బాల్ క్రీడా టోర్నమెంటులో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. తనూజను, పీటీ దేవిని డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కాలేషాబేగం, ప్రిన్సిపాల్ కె.గ్రేస్ లిల్లీ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి..

- ఓలా టూ వీలర్ డ్రైవర్ గొరుసు బాలాజీ రెడ్డి ఈ నెల 18న గీతం కాలేజీ వద్ద చంద్రంపాలేనికి చెందిన అనారి కౌశిక్‌ను తన బైక్‌పై తీసుకువస్తున్న క్రమంలో ఎండాడ ఎంకే అపార్ట్‌మెంట్ వద్ద యూ టర్న్ తీసుకొంటుండగా ఎ.వివేక్ అనే వ్యక్తి తన బైకుతో ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బాలాజీ రెడ్డికి, అనారి కౌశిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

వుడా రోడ్డులో..

చంద్రంపాలెంకు చెందిన అప్పలరాజు మిథిలాపురి వుడా కాలనీకి తన బైక్‌పై ఉడా రోడ్డులో వెళ్తుండగా టాటా సఫారీ కారు ఢీకొనడంతో అప్పలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ సంఘటన స్థలం నుంచి వాహనంతో పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కుండపోత వాన



రామాద్రి వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

- పల్లపు ప్రాంతాలు జలమయం



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద అవస్థలు



విజయానందపురం జంక్షన్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు



వేములవలస బరోడా బ్యాంకు ఎదురుగా జలమయం అయిన వీధి



తునివలస వద్ద జలమయమైన రోడ్డు

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన కుండపోత వానకు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గణపతి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలకు స్వల్ప అంతరాయం కలిగింది.

- ఆనందపురం మండలం వేములవలస వద్ద బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఎదురుగా వీధిలో వర్షంనీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఇక్కడ పల్లపు ప్రాంతాన్ని పూడ్చి సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఎం పాలెం: ఆరోవార్డు పరిధిలో భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో సుమారు గంట సేపు వాన కురవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

రోడ్లపై నిలిచిన నీరు

మధురవాడ: భారీ వర్షానికి మధురవాడ అప్ బ్రిడ్జి, ఉడా కాలనీ జంక్షన్, మధురవాడ మార్కెట్ తదితర ప్రాంతాల్లో నీరు రోడ్లపై నిలిచిపోయింది.

తీరంలో భారీ వర్షం

కొమ్మాది: భీమిలి తీర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రామాద్రి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

చెరువుల్లా రహదారులు

పద్మనాభం: గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు చెరువుల్లా మారాయి. విజయనగరం – కొంత్యాం ఆర్ అండ్ బీ రోడ్డు జలమయం కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పద్మనాభం, రెడ్డిపల్లి, విజయానందపురం తదితర గ్రామాల్లో వర్షం కరిసింది. విజయానందపురం జంక్షన్, రెడ్డిపల్లి కోమటి గుండం, యాతపేట, పద్మనాభం సచివాలయం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు చెరువును తలపించింది. తునివలస నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు జలమయమైంది.

నిమజ్జనానికి గణనాథులు



సంతపేట రెడ్డివీధిలో నిమజ్జనానికి తరలించే ముందు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలు మండపాల నుంచి గణనాథుడి విగ్రహాలను నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు. అంతకు ముందు వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించి, లడ్డూలను వేలం వేశారు. అనంతరం పులివేషాలు, డీజే, బాణసంచా, కోలాటం, నేలవేషాలతో నిమజ్జనోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. గోస్తని నది, చెరువుల వరకు ఊరేగింపులు సాగాయి.

వ్యకి అదృశ్యం

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. కలవకొల్లు సాయి కుమారి, తన కుమారు డు పద్మాకర్ (45), అతని కుమారుడితో వైఎస్సార్ క్రికెట్ స్టేడియంకు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. పద్మాకర్ మానసిక వ్యాధితో బాధపడుతున్న కారణంగా అతని భార్య విడిపోయింది. పద్మాకర్ ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో పద్మాకర్ తల్లి సాయికుమారి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరపనున్నట్టు నిర్వాహకులు బ్రహ్మకుమారీలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వ్రతాలు జరుతాయని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన దలిచే వారు సంప్రదాయ వస్త్రధారణలో రావాలని వారు కోరారు.

బోధనా సిబ్బంది కొరతపై స్పందన

తగరపువలస: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల భర్తీ విషయంలో మహాత్మా జ్యోతీబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి–విజయవాడ, ఎ.కృష్ణమోహన్ స్పందించారు. నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న ఈ ఏడాది జూన్ 24న కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బోధనా సిబ్బంది కొరతపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కృష్ణమోహన్ స్పందించి సిబ్బంది కొరతపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

తగరపువలస: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు చిత్రలేఖనం, పాటలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మన ఇల్లు, మన పాఠశాల, మన గ్రామం, మన మండలం .. పరిసరాలు బాగుపడాలంటే. అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, టీచర్లు రమేష్, మల్లిక పాల్గొన్నారు.